# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 సంచిక: 10 ఎడిటర్: మేనం శ్యామ్ బుధవారం 29-07-2026 పేజీలు: 10


## సిరా చుక్క

జర్నలిజం అంటే ఎందుకో పిచ్చి.
ప్రజల పక్షాన నిలిచినపుడు
ఆ ఆనందమే వేరు.
నా వార్త వల్ల బాధితులకు న్యాయం జరిగితే
అదే వరల్డ్ కప్ లా భావిస్తా..
బాధితులు చూపించే కృతజ్ఞత
నాకు గోల్డ్ మెడల్ తో సమానం
గల్లీకి పది మంది నకిలీ రిపోర్టర్లు
పుట్టుకొస్తున్నా..
ఎంత మంది ఎంత అప్రతిష్ఠ పాలు చేస్తున్నా..
నా కలం, నా రాత ఆగదు.
జర్నలిజం లో ఎంత మంది తొక్కాలని
చూసినా..
నా పయనం ఆగదు.
ఎన్ని బెదిరింపులు వచ్చినా
అది నాకు బూస్ట్ ల భావిస్తా..
ఇంకా రెచ్చిపోతా..
జేబులో రూపాయి లేకున్నా..
నా జేబులో ఉన్న కలానికి కోట్ల విలువ.
నా కలం ప్రజల పక్షాన నిలిచిందినా
కలం ఎందరో బాధితులకు ఆసరాగా నిలిచింది.
నా కలం అధికారులను కదిలించింది,
రాజకీయ నాయకులను వణికించింది.
నా కలం కొందరికి న్యాయం చేసింది.
కొంత మంది శత్రువులను కూడా పుట్టించింది.
లోపల ఎన్ని బాధలు ఉన్నా..
రూపాయి రాని ఈ రాతలెందుకని
కట్టుకున్న భార్య అన్నా..
నా మనసు మాట వినదు
నా కలం ఆగదు,
నా ప్రయాణం ఆగదు
అందుకే జర్నలిజం అంటే అంత పిచ్చి

– కన్నోజు జగన్ ..
జర్నలిస్ట్, గోదావరిఖని...



## పర్మిషన్ పరిమితం... బోధన అపరిమితం

- అనుమతులు ఏడో తరగతి వరకే
- పదో తరగతి వరకు బోధన ఎలా
- అనుముల మండలంలో సన్ రైస్ రెసిడెన్షియల్ స్కూల్ పై ఆరోపణల దుమారం
- అనుమతి లేని తరగతుల్లో బోధన సాగుతోందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆరోపణలు
- ప్రజా వాణిలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు
- హాస్టల్‌లో కనీస వసతులు కరువు
- విద్యార్థుల భద్రతపై ఆందోళన




- ఎంఈఓ నోటీసు జారీ.. డీఈఓ స్పందన కోసం చేసిన ప్రయత్నం ఫలించలేదు

## తెలంగాణ టీవీ అవార్డులకు రూపురేఖలు పారదర్శకంగా ఎంపికలు

- మంత్రి కోమటిరెడ్డి
- టీవీ అవార్డుల కమిటీతో సమావేశమైన సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి
- తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని సూచన.
- మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరుపై సీఎంతో చర్చిస్తామని వెల్లడి

2 లో

## యూరియా కొరత కేంద్రంపై నిందలు సరికాదు



- సీఎం రేవంత్‌పై ఎంపీ అర్వింద్ విమర్శలు
- రైతుల ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపణ
- కేంద్రం గతంతో పోలిస్తే ఎక్కువ ఎరువులు సరఫరా చేసిందని వెల్లడి
- డీఏపీ అక్రమాలపై చర్యల్లో కాంగ్రెస్ నేతల పేర్లు వెలుగులోకి వచ్చాయన్న అర్వింద్

2 లో

## హైడ్రాపై కేటీఆర్ తీవ్ర విమర్శలు..

- 9 తలల విషసర్పం వ్యాఖ్యలతో ప్రభుత్వంపై ఫైర్!
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారని ఆరోపణ
- పెద్దల ఆక్రమణలపై చర్యలు ఎందుకు లేవని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్
- అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైడ్రా వ్యవస్థపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు.

**పేదల ఇళ్లపైనే హైడ్రా చర్యలంటూ విమర్శ**

హైడ్రా పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అధికార పార్టీకి చెందిన పెద్దల భవనాలు, చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు, మరికొందరు

మిగతా 2లో



## పసిమొగ్గలకు రక్షణ ఎక్కడ..?

- కామాంధుల కబంధ హస్తంలో బాల్యం
- గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 3,029 పోక్సో కేసులు నమోదు
- రోజు ఏదో ఓ జిల్లాలో చిన్నారులపై లైంగిక దాడులు
- అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలం.?
- బాధితులకు రక్షణ, కౌన్సిలింగ్, నిందితులపై నిఘాలో శాఖల మధ్య సమన్వయ లోపం
- షాబాద్ ఘటనతో మరోసారి బాధితుల భద్రతపై ప్రశ్నలు
- జిల్లా స్థాయిలో ప్రొబేషన్ వ్యవస్థ పనితీరుపై విమర్శలు..
- సమగ్ర రక్షణ వ్యవస్థ కోరుతున్న సామాజికవేత్తలు

2 లో

# హైడ్రా కొనసాగుతుంది.. కబ్జాకోరులను వదిలేది లేదు

- సీఎం రేవంత్ రెడ్డి
- కబ్జాలు చేస్తే బడాబాబులైనా, పేదలైనా చర్యలు తప్పవన్న సీఎం..
- హైడ్రా అతిపెద్ద సంస్కరణ.. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి..
- కేంద్ర మంత్రిని కలిసి తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల కేటాయింపు కోరిన ముఖ్యమంత్రి..



**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** హైడ్రా పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. హైడ్రాను వ్యతిరేకిస్తున్నది కబ్జాకోరులేనని ఆరోపించారు. ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

**బడాబాబులైనా.. పేదలైనా ఒకే న్యాయం**

ఆక్రమణలకు పాల్పడితే వారు బడాబాబులైనా, పేదలైనా ప్రభుత్వం ఉపేక్షించదని సీఎం స్పష్టం చేశారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ వంటి నిర్మాణాలపై చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ప్రభుత్వం ఎవరిపట్లా వివక్ష చూపడం లేదన్నారు.



**హైడ్రా అతిపెద్ద సంస్కరణ**

హైడ్రా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణల్లో ఒకటని సీఎం పేర్కొన్నారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని స్పష్టం చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పై గతంలో 400కుపైగా కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**కోర్టు తీర్పు పరిశీలించి ముందుకెళ్తాం**

దురుద్దేశంతోనే కొన్ని కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు గుప్పించారు. హైకోర్టు తీర్పును పూర్తిగా పరిశీలించిన తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. హైడ్రా పనితీరుపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, కబ్జాకోరులకు మీడియా సహకరించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో డబ్బులు ఖర్చు చేసి హైడ్రాపై

మిగతా 2లో

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్

- ఉప్పరపల్లి కోర్టులో నేడు హాజరు!
- మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో నమోదైన కేసులో కీలక పరిణామం
- నాలుగు ప్రత్యేక బృందాల గాలింపు అనంతరం అదుపులోకి తీసుకున్న పోలీసులు
- బాధితురాలి మెడపై గొంతు నులిమిన ఆనవాళ్లు.. వైద్య పరీక్షల్లో వెలుగులోకి.

2 లో



# పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యం విషమం

## వెంటిలేటర్‌పై చికిత్స!

- తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజంతో గుండెపోటు.. యశోద హెల్త్ బులెటిన్..
- మెదడుకు ఆక్సిజన్ లోపంతో న్యూరాలజికల్ నష్టం..
- 72 గంటల తర్వాత మరోసారి పరీక్షలు.. అప్పుడే ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత..



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా గుండెపోటుకు గురైన ఆయన ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో మెకానికల్ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు.

**పల్మనరీ ఎంబోలిజంతో గుండెపోటు**

యశోద ఆస్పత్రి వైద్యుల వివరాల ప్రకారం.. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి రక్తప్రసరణ వ్యవస్థ ఒక్కసారిగా దెబ్బతింది. దీంతో ఆయన షాక్‌కు గురై గుండెపోటు వచ్చినట్లు తెలిపారు. అనంతరం అత్యవసర వైద్య చికిత్స అందిస్తూ నిపుణుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

**వరంగల్‌లో అత్యవసర చికిత్స.. హైదరాబాద్‌కు తరలింపు**

గుండెపోటు వచ్చిన వెంటనే వరంగల్‌లోని రోహిణి ఆస్పత్రిలో పెద్ది సుదర్శన్‌రెడ్డికి అత్యవసర చికిత్స అందించారు. సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ నిర్వహించి గుండె స్పందనను పునరుద్ధరించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని

మిగతా 2లో

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

### రంగారెడ్డి జిల్లా మహిళ మృతి

- న్యూజెర్సీలో సిగ్నల్ వద్ద ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో వాహనం
- ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన దీపారెడ్డి దుర్మరణం
- ఇద్దరు కుమార్తెలను వదిలి వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

2 లో



# పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యం విషమం

మొదటి పేజీ తరువాయి

యశోద ఆస్పత్రికి తరలించారు.

**మెదడుకు ఆక్సిజన్ లోపం.. న్యూరాలజికల్ నష్టం**



ప్రస్తుతం తక్కువ మోతాదులో మందులతో రక్తపోటు, ఇతర కీలక అవయవాల పనితీరు నిలకడగా ఉన్నప్పటికీ.. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి మాటలకు గానీ, నొప్పి ఉద్దీపనలకు గానీ అర్థవంతమైన న్యూరాలజికల్ స్పందన కనిపించలేదని వైద్యులు తెలిపారు. ఈఈజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల న్యూరాలజికల్ నష్టం జరిగినట్లు గుర్తించినట్లు హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు.


**72 గంటల తర్వాతే స్పష్టత**

అంతర్జాతీయ వైద్య మార్గదర్శకాల ప్రకారం.. మరో 72 గంటల తర్వాత న్యూరాలజికల్ రీ-అసెస్‌మెంట్ నిర్వహించి ఆరోగ్య పరిస్థితిపై మరింత స్పష్టత ఇస్తామని యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాలకు చెందిన నిపుణుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోందని, చికిత్సకు సంబంధించిన ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం వెల్లడించింది.

**ఆస్పత్రికి నేతల రాక.. కుటుంబానికి పరామర్శ**

పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి సీతక్క, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితర నేతలు కూడా పార్టీలకు అతీతంగా ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# పసిమొగ్గలకు రక్షణ ఎక్కడ..?




**ప్రజా వాయిస్,హైదరాబాద్:** తెలంగాణలో చిన్నారులపై లైంగిక దాడుల ఘటనలు ఆందోళనకర స్థాయికి చేరుతున్నాయి. బాలల రక్షణ కోసం కఠినమైన పోక్సో చట్టం అమల్లో ఉన్నప్పటికీ కామాంధుల దారుణాలు మాత్రం ఆగడం లేదు. రాష్ట్రంలో దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక జిల్లాలో చిన్నారులపై అత్యాచారం, లైంగిక వేధింపులు, లైంగిక దాడుల ఘటనలు వెలుగుచూస్తుండటం సమాజాన్ని కలవరపెడుతోంది. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 3,029 పోక్సో కేసులు నమోదుకావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంటే సగటున రోజుకు ఎనిమిదికి పైగా కేసులు నమోదవుతున్నాయి. చట్టం కఠినంగా ఉన్నప్పటికీ చిన్నారులపై లైంగిక దాడులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తేడా లేకుండా ఘటనలు వెలుగుచూస్తుండటం సమాజానికి హెచ్చరికగా మారింది.

**కేసు నమోదు వరకే వ్యవస్థ..?**

ఘటన జరిగిన వెంటనే కేసు నమోదు, నిందితుడి అరెస్టుతో అధికార యంత్రాంగం బాధ్యత ముగిసినట్లుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాధిత చిన్నారి, కుటుంబానికి నిరంతర భద్రత, మానసిక ధైర్యం, చట్టపరమైన సహాయం, పునరావాసం వంటి అంశాలు ఆశించిన స్థాయిలో అమలుకావడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**శాఖల మధ్య సమన్వయం ఎక్కడ.?**

పోలీసులు, మహిళా-శిశు సంక్షేమ శాఖ, ప్రొబేషన్ అధికారులు, న్యాయవ్యవస్థ, బాలల సంక్షేమ కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో ఆ వ్యవస్థ పూర్తిస్థాయిలో కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్ల బాధిత కుటుంబాలు బెదిరింపులు, సామాజిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న సందర్భాలు వెలుగులోకి వస్తున్నాయి.

**షాబాద్ ఘటనతో మళ్లీ చర్చ**

ఇటీవల షాబాద్‌లో చోటుచేసుకున్న ఘటన బాధితుల భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. కేసు నమోదైన తర్వాత కూడా బాధితులకు నిరంతర రక్షణ, పర్యవేక్షణ, కౌన్సిలింగ్ అందించడంలో లోపాలున్నాయన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. నిందితుడిని అరెస్టు చేయడం మాత్రమే కాకుండా బాధితుడి భవిష్యత్ రక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రొబేషన్ వ్యవస్థపై విమర్శలు**

జిల్లా స్థాయిలో ప్రొబేషన్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైనది. బాధిత కుటుంబాలతో నిరంతర సంబంధం కొనసాగించడం, పునరావాసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం, మానసిక కౌన్సిలింగ్ వంటి బాధ్యతలు సమర్థంగా అమలుకావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సామాజికవేత్తలు కోరుతున్నారు.

**శిక్షలతోనే సరిపోదు**

పోక్సో చట్టం లక్ష్యం కేవలం నిందితులను శిక్షించడం మాత్రమే కాదు. బాధిత చిన్నారికి భద్రత, గౌరవప్రదమైన జీవితం, మానసిక ధైర్యం కల్పించడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. వేగవంతమైన విచారణ, సాక్షుల రక్షణ, బాధిత కుటుంబాలకు ఆర్థిక, మానసిక సహాయం, సమర్థవంతమైన పునరావాస వ్యవస్థ అమలైతేనే పోక్సో చట్టం అసలు లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడుతున్నారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ శివారులో ఆయనను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఆయనను ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు.

**బాధిత అధికారిణి ఫిర్యాదుతో కేసు నమోదు**

జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదు మేరకు ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. తనను లైంగికంగా వేధించడంతో పాటు వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి మానసికంగా ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సంబంధిత చట్టాల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు**

విచారణలో భాగంగా నిందితుడు పేర్కొన్న రెండు చిరునామాలకు పోలీసులు నోటీసులు అందించేందుకు వెళ్లగా ఆయన ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం హైదరాబాద్ శివారులో ఉదయ్ కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**బాధితురాలికి గాయాల ఆనవాళ్లు**

ఈ కేసులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదైన రోజే బాధిత మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఆమె మెడపై గొంతు నులిమినట్లు గాయాల ఆనవాళ్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చెంపపై కమిలిన గాయాలు, ఎడమ కాలిపై గాయం కూడా ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలినట్లు సమాచారం.

**పారదర్శకంగా దర్యాప్తు: డీసీపీ**

ఈ కేసును పూర్తిగా పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి తదుపరి దర్యాప్తును కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# హైడ్రాపై కేటీఆర్ తీవ్ర విమర్శలు..

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ నాయకుల నిర్మాణాలపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

**హైకోర్టు వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివి**

హైడ్రాపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన కేటీఆర్.. "హైడ్రా అనేది 9 తలల విషసర్పం" అని కోర్టు వ్యాఖ్యానించిందని పేర్కొన్నారు. అలాంటి వ్యాఖ్యలు రావడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పెద్ద హెచ్చరిక అని అన్నారు.

**నిషేధిత భూములపై ప్రశ్నలు**

కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో నుంచి దిగిపోయే నాటికి రాష్ట్రంలో 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా, ప్రస్తుతం అది కోటి ఎకరాలకు చేరుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఈ స్థాయిలో భూములను నిషేధిత జాబితాలో చేర్చడానికి కారణమేంటని, ఇందులో అవినీతి, కమిషన్ల వ్యవహారం ఉందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**హైడ్రా బ్లాక్‌మెయిలింగ్ సాధనమని ఆరోపణ**

హైడ్రా పేరుతో వేలాది ఇళ్లను కూల్చివేసి రియల్ ఎస్టేట్ రంగంలో భయాందోళనలు సృష్టిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా ప్రభుత్వం చేతిలో బ్లాక్‌మెయిలింగ్, ఎక్స్‌టార్షన్ సాధనంగా మారిందని విమర్శించారు. బిల్డర్ల నుంచి "ఆర్‌ఆర్ ట్యాక్స్" వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా చేశారు.

**అధికారంలోకి వస్తే హైడ్రా రద్దు**

హైడ్రా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజే రద్దు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. హైకోర్టు సూచనలకు అనుగుణంగా హైడ్రాను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. రంగారెడ్డి జిల్లా మహిళ మృతి

**ఆమనగల్లు, ప్రజా వాయిస్:** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) మృతి చెందారు. న్యూజెర్సీలో సోమవారం జరిగిన ఈ ప్రమాదం ఆమె కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**సిగ్నల్ వద్ద ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో వాహనం**

కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. న్యూజెర్సీలో దీపారెడ్డి ప్రయాణిస్తున్న కారు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

**20 ఏళ్ల క్రితం వివాహం.. అమెరికాలో స్థిర నివాసం**

మాడుగుల మండల కేంద్రానికి చెందిన పట్టాభి శేఖర్ రెడ్డి, శశిరేఖ దంపతుల కుమార్తె అయిన దీపారెడ్డికి 20 ఏళ్ల క్రితం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డితో వివాహమైంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారు.

**కుటుంబంలో విషాదం**

దీపారెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమెకు సంస్కృత, హర్షిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వగ్రామంలో ఈ విషాద వార్త తెలిసి గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.




# హైడ్రా కొనసాగుతుంది.. కబ్జాకోరులను వదిలేది లేదు

మొదటి పేజీ తరువాయి

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**విద్యా వ్యవస్థపై కేంద్రానికి సూచనలు**

ఆఫ్‌లైన్ పరీక్షల నిర్వహణ వల్లే ఎక్కువ సమస్యలు తలెత్తుతున్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తూ.. విద్య ప్రధానంగా రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టామని తెలిపారు.

**తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కోరిన సీఎం**

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (PMAY) కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామీణాభివృద్ధి పథకాల కింద అదనపు పనులు, కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం షెడ్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి లబ్ధిదారులకు 90 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.

# తెలంగాణ టీవీ అవార్డులకు రూపురేఖలు పారదర్శకంగా ఎంపికలు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ టీవీ అవార్డుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. టీవీ అవార్డుల కమిటీతో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమై అవార్డుల పేరు, లోగో, కేటగిరీలు, ప్రదానోత్సవ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.

**తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా లోగో**

అవార్డుల పేరు, లోగో తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా రూపొందించాలని మంత్రి కమిటీ సభ్యులకు సూచించారు. కమిటీ సభ్యులు ప్రతిపాదించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**ప్రదానోత్సవానికి వేదికల పరిశీలన**

టీవీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహణ కోసం రెండు లేదా మూడు వేదికలను కమిటీ సభ్యులు సూచించాలని మంత్రి కోరారు. అనంతరం ముఖ్యమంత్రితో చర్చించి తుది వేదికను ఖరారు చేస్తామని వెల్లడించారు.

**పారదర్శకంగా అవార్డుల ఎంపిక**

అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. టెలివిజన్ రంగం ప్రజలకు విశేష వినోదాన్ని అందిస్తోందని, ఈ రంగంలో ప్రతిభ కనబరిచిన అన్ని విభాగాల కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా అవార్డులు అందజేస్తామని తెలిపారు.

# యూరియా కొరత కేంద్రంపై నిందలు సరికాదు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రంపై నిందలు మోపుతోందని ఆరోపించారు.

**కేంద్రం నుంచి ఎరువుల సరఫరా పెరిగిందన్న అర్వింద్**

తెలంగాణకు 2016-17లో కేంద్ర ప్రభుత్వం 26.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందించగా, 2025-26 నాటికి ఆ పరిమాణాన్ని 42.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచిందని ధర్మపురి అర్వింద్ తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో కేంద్రం ఎలాంటి నిర్లక్ష్యం చేయలేదని స్పష్టం చేశారు.

**యాప్‌తో రైతులకు మరిన్ని ఇబ్బందులు**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ కారణంగా రైతులు ఎరువుల కోసం మరింత ఇబ్బందులు పడుతున్నారని అర్వింద్ విమర్శించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి ఇప్పుడు కొరత వచ్చిందంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

**డీఏపీ అక్రమాలపై చర్యలు**


ఏప్రిల్ నుంచి జూలై మధ్యకాలంలో డీఏపీ ఎరువుల అక్రమాలపై 28 షోకాజ్ నోటీసులు జారీ చేయగా, 9 లైసెన్సులను రద్దు చేసి, 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అర్వింద్ తెలిపారు. ఈ వ్యవహారాలపై దర్యాప్తు జరిపితే కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తుల పేర్లు వెలుగులోకి వచ్చాయని ఆరోపించారు.

**ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం**

రైతులకు సకాలంలో యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాన్ని దాచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరైన విధానం కాదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.

# పర్మిషన్ పరిమితం... బోధన అపరిమితం

**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం, నల్గొండ.** ప్రభుత్వ నిబంధనలు ఒకవైపు... ప్రైవేటు పాఠశాలల నిర్వహణ మరోవైపు. అనుమతులు ఒక తరగతి వరకు ఉండగా, బోధన మాత్రం అంతకు మించి కొనసాగితే ఆ విద్యార్థుల భవిష్యత్తు పరిస్థితి ఏమిటి.. ఇదే ప్రశ్న ఇప్పుడు నల్గొండ జిల్లా అనుముల మండలంలోని ఆల్వాల ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న సన్ రైస్ రెసిడెన్షియల్ స్కూల్ వ్యవహారంలో వినిపిస్తోంది. ప్రభుత్వ అనుమతి ఏడో తరగతి వరకు మాత్రమే ఉన్నప్పటికీ, ఎనిమిదో నుంచి పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారంటూ తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి.



**అడ్మిషన్లు జోరు... అనుమతులపై సందేహాలు**

ప్రతి విద్యా సంవత్సరం భారీగా అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులకు గుర్తింపు వివరాలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పదో తరగతి వరకు బోధన కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత తరగతులకు అధికారిక అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ అనుమతి లేకుండానే తరగతులు నిర్వహిస్తే అది విద్యాశాఖ నిబంధనల ఉల్లంఘనే అవుతుందని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**రెసిడెన్షియల్ అంటే భద్రత ఉండాలి... కానీ**

రెసిడెన్షియల్ పాఠశాల అంటే విద్యతో పాటు భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలి. అయితే ఈ పాఠశాలలో హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా లేవని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, పరిశుభ్రత వంటి ప్రాథమిక వసతులే ప్రశ్నార్థకంగా మారాయని చెబుతున్నారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.



**విద్యార్థుల భవిష్యత్ పై భయం**

అనుమతి లేని తరగతుల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటి? పదో తరగతి పరీక్షలకు హాజరు కావాలంటే హాల్ టికెట్లు ఎలా వస్తాయి.. విద్యా సంవత్సరం నష్టపోతే బాధ్యత ఎవరిది..అనే ప్రశ్నలు తల్లిదండ్రులను వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.

**నోటీసు ఇచ్చాం... చర్యలు ఉంటాయి : ఎంఈఓ**

ఈ వ్యవహారంపై అనుముల మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రామచంద్రయ్య స్పందిస్తూ,ఈ విషయం నా దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత పాఠశాల యాజమాన్యానికి నోటీసు జారీ చేశాం. మొత్తం అంశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

**డీఈఓ స్పందన రాలేదు**

ఈ ఆరోపణలపై నల్గొండ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) స్పందన కోసం ప్రజా వాయిస్ ప్రతినిధి ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించినప్పటికీ, ఆయన అందుబాటులోకి రాలేదు.pవిద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల విశ్వాసం, విద్యా వ్యవస్థ ప్రతిష్ఠకు సంబంధించిన ఈ అంశంపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.






## పట్నం కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి

**(ప్రజా వాయిస్ షాబాద్)షాబాద్:** మాతృవియోగాన్ని ఎదుర్కొన్న పట్నం కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు షాబాద్‌లోని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి నివాసానికి చేరుకున్న మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లు రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పట్నం అవినాష్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు పరామర్శించి ధైర్యం చెప్పారు పట్నం కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు గత వారం నీమ్స్ ఆస్పత్రిలో రుక్కమ్మను పరామర్శించగా ఆమె ఉత్సాహంగా మాట్లాడారని మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రుక్కమ్మ ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేష్ రెడ్డి, ధర్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ డీసీసీబీ చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కొలన్ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మహిపాల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కోదాడపై కలెక్టర్ ఫోకస్.. ఆసుపత్రి నుంచి పాఠశాలల వరకు ఆకస్మిక తనిఖీలు

- 100 పడకల ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతపై రాజీ వద్దని హెచ్చరిక
- విద్యార్థులు లక్ష్యంతో చదవాలని సూచన
- డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం






**ప్రజా వాయిస్,కోదాడ:** ప్రజల ఆరోగ్యం, విద్య, గృహ వసతి వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిన సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం కోదాడ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డబుల్ బెడ్రూం ఇండ్లను ఆకస్మికంగా పరిశీలిస్తూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ముందుగా కోదాడ 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. నిర్మాణంలో లోపాలు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా మెట్ల నిర్మాణం, వార్డుల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గర్భిణులకు సాధ్యమైనంత మేర సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, నేరుగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారితో కలిసి బెంచీపై కూర్చొని పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు.తర్వాత బాలాజీ నగర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ నాయక్, హౌసింగ్ ఏఈ జెఎస్ఎన్ మూర్తి, వైద్యులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మూడోసారి ఆడపిల్లేనని అబార్షన్.. మహిళ మృతి

- జనగామ జిల్లాలో ఘటన, ఇద్దరు అరెస్ట్.




**ప్రజా వాయిస్/జనగామ** (రఘునాథపల్లి)మూడో సారీ ఆడపిల్లే అని తేలడంతో అబార్షన్ చేసుకున్న మహిళ తీవ్ర రక్తస్రావంతో చనిపోయింది. మహిళ మృతికి కారణమైన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన భాస్కర్ గౌడ్ కు దేవరుప్పుల మండలం కొలుకొండ గ్రామానికి చెందిన శ్రావణి (35)తో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. భాస్కర్ గౌడ్ హైదరాబాద్ లో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు.శ్రావణి మూడోసారి గర్భం దాల్చడంతో కొన్ని రోజులుగా తల్లిగారింట్లో ఉంటోంది. ఇటీవల శ్రావణి, ఆమె తల్లి శోభ హనుమకొండలోని ఓ ప్రైవేట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ నిర్వాహకుడు ప్రవీణ్ దగ్గరకు వెళ్లగా.. అతడు శ్రావణిని పరీక్షించి కడుపులో ఉన్నది ఆడపిల్ల అని చెప్పాడు. ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉండగా.. మళ్లీ అమ్మాయి అని తేలడంతో అబార్షన్ చేయించాలని నిర్ణయించారు. దీంతో కోలుకొండకు చెందిన ఆర్ఎంపీ రచ్చ శ్రావణ్ కుమార్ సహకారంతో జనగామలోని సంజయ్ నగర్ కు చెందిన ప్రైవేట్ ఏఎన్ఎం అనసూయను కలిశారు.ఆమె ఈ నెల 21న తన ఇంట్లోనే శ్రావణికి అబార్షన్ చేసింది. తర్వాతి రోజు శ్రావణికి తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే సికింద్రాబాద్ లోని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ ట్రీట్ మెంట్ తీసుకుంటూ శనివారం తెల్లవారుజామున శ్రావణి చనిపోయింది. భర్త భాస్కర్ గౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఏఎన్ఎం అనసూయ, ఆర్ఎంపీ రచ్చ శ్రావణ్ కుమార్ ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అబార్షన్ కు ప్రోత్సహించిన మృతురాలి తల్లి శోభ, స్కానింగ్ చేసిన డయగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు ప్రవీణ్ పరార్ లో ఉన్నారని జనగామ సీఐ సత్యానారాయణ రెడ్డి తెలిపారు.



## తెలంగాణ రాష్ట్ర హామీల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**ప్రజా వాయిస్ నారాయణఖేడ్** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర శాసనసభ (అసెంబ్లీ) ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభా హామీల కమిటీ చైర్మన్‌గా నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈరోజు ఘనంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్,రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సంజీవరెడ్డి కి వారు పుష్పగుచ్ఛం అందజేసి, మిఠాయిలు తినిపించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ...తనపై నమ్మకంతో హామీల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ అధిష్టానానికి, స్పీకర్ కి మరియు సహకరించిన పెద్దలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును వేగవంతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ఈ కమిటీ ద్వారా శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,నారాయణఖేడ్ నియోజకవర్గ ముఖ్య నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కి అభినందనలు తెలిపారు.

## రామప్ప వైభవం అద్భుతం

- భావితరాలకు పరిరక్షించాలి
- రామప్ప ఆలయాన్ని సందర్శించిన మాజీ ప్రధాన కార్యదర్శులు

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా;** వెంకటాపూర్ మండలం./ ములుగు జిల్లా పాలంపేటలోని యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, 1962 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సునీత, తెలంగాణ తొలి ప్రధాన కార్యదర్శి ప్రదీప్ చంద్ర సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన అతిథులకు అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం దేవాలయ కార్యనిర్వహణాధికారి ఇమ్మడి భాస్కర్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ రామప్ప దేవాలయ చరిత్ర, కాకతీయుల అపూర్వ శిల్పకళ, నిర్మాణ విశిష్టత, ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన నేపథ్యాన్ని అతిథులకు వివరించారు. ఈ సందర్భంగా కాకి మాధవరావు మాట్లాడుతూ.....రామప్ప దేవాలయం భారతీయ శిల్పకళా వైభవానికి సజీవ సాక్ష్యం. ఇలాంటి చారిత్రక సంపదలను పరిరక్షించి భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రదీప్ చంద్ర మాట్లాడుతూ..... తెలంగాణ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన రామప్ప దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు కొనసాగాలి" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సునీత రామప్ప ఆలయ శిల్పకళను పరిశీలించి ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, సహాయ పర్యాటక అధికారి సూర్యకిరణ్, తహసీల్దార్ గిరిబాబు, ఆర్ఐ రమేష్, పర్యాటక పోలీసులు, పురావస్తు శాఖ సిబ్బంది, పర్యాటక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




## నాలుగేళ్లుగా నరకయాతన!

- నిద్రపోతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు!
- మృత్యు ఉచ్చుగా మారిన కేసారం అండర్‌పాస్ రహదారి
- ప్రమాదం జరిగితేనే కళ్లు తెరుస్తారా?

**ప్రజావాయిస్ / మోమిన్‌పేట్** మోమిన్‌పేట్ మండలంలోని కేసారం రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తై నాలుగేళ్లు గడుస్తున్నా, అక్కడి రహదారి సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో తవ్విన మట్టిని రహదారికి ఇరువైపులా పోయడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో రహదారి పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడి, ప్రయాణికులకు నిత్యం ప్రాణాపాయంగా మారింది.వర్షం పడితే ఈ రహదారి చెరువును తలపిస్తోంది. గుంతలు నీటిలో కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలువురు గుంతల్లో పడి గాయపడినా సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.ప్రజల నుంచి ఎన్నిసార్లు ఫిర్యాదులు వెళ్లినా అధికారులు ఒక్కసారి కూడా స్థలాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రజల ప్రాణాలకు విలువ లేదా? ప్రమాదాలు జరిగాకే స్పందిస్తారా? అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.రహదారికి ఇరువైపులా పోసిన మట్టిని వెంటనే తొలగించి, వర్షపు నీరు వెళ్లేలా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేసి, పూర్తిగా కొత్త బీటీ రహదారిని నిర్మించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.ఇకపై కూడా అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే ప్రజలతో కలిసి భారీ ఆందోళన చేపట్టి రహదారిపైనే నిరసనకు దిగుతామని ప్రయాణికులు తీవ్ర హెచ్చరిక చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కేసారం అండర్‌పాస్ రహదారి వెంటనే మరమ్మతు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ప్రభుత్వాన్ని ముక్త కంఠంతో కోరుతున్నారు.





## సాగునీరు దారి మళ్లించి.. కోదాడ రైతుల గొంతు కోశారు..?

- అనంతగిరి సబ్‌స్టేషన్ ఎదుట మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ధర్నా
- చెరువులు నింపకుండా పాలేరుకు నీళ్లు మళ్లించారని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందే వరకు రైతుల పక్షాన ఉద్యమం కొనసాగుతుందన్న హెచ్చరిక

**ప్రజా వాయిస్,అనంతగిరి:** కోదాడ నియోజకవర్గ రైతులను ప్రభుత్వం కరువుకే వదిలేసిందా..? చెరువులు నింపాల్సిన సాగునీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించి రైతుల పొలాలను ఎండబెట్టిందా..? నాణ్యమైన విద్యుత్, సాగునీరు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తోందా..? అంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన, రైతులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడం లేదని అధికారులను నిలదీశారు. అనంతరం రైతులతో కలిసి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. తర్వాత నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సాగునీరు, విద్యుత్ సమస్యలపై రైతులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోదాడ నియోజకవర్గ చెరువులు నిండకపోవడానికి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధ్యత వహించాలని ఆరోపించారు. కోదాడ రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.జూన్ చివరి వారంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి విడుదలైన నీటిని ముందుగా కోదాడ చెరువులకు మళ్లించకుండా పాలేరు రిజర్వాయర్‌కు తరలించారని ఆరోపించారు. ఆ సమయంలో రైతులు గేట్ల వద్దకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడుకుంటుంటే, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం సొంత జిల్లా రైతుల ప్రయోజనాలను విస్మరించారని విమర్శించారు.

## తెలంగాణపై అల్పపీడన ప్రభావం

- భారీ వర్షాల హెచ్చరిక

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** మధ్య భారతదేశంలోని అల్పపీడనంతో సంబంధం ఉన్న ద్వితీయ అభిసరణ కారణంగా, ఉత్తర, పశ్చిమ, తూర్పు తెలంగాణ జిల్లాలలోని వివిధ ప్రాంతాలలో (ఎరుపు రంగులో గుర్తించబడిన ప్రాంతాలు) భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక్కడ రాబోయే 4 రోజులలో కొన్ని చోట్ల మొత్తం వర్షపాతం 100–120 మి.మీ. వరకు చేరవచ్చు. ఇప్పటివరకు మనం చూస్తున్న ఎల్–నినో పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే, ఈ రుతుపవన కాలంలో తెలంగాణలో ఇదే అత్యుత్తమ వర్షపాతం కానుంది. ఇదిలా ఉండగా, నీలం రంగులో గుర్తించబడిన జిల్లాలలో, హైదరాబాద్ నగరంతో సహా, రాబోయే 4 రోజులు మోస్తరు వర్షాలు కురుస్తాయి.నల్గొండ, యాదాద్రి – భోంగిర్ జిల్లాలపై ప్రభావం తక్కువగా ఉం టుంది, రాబోయే 4 రోజులలో తేలికపాటి వర్షా లు (అక్కడక్కడా మోస్తరు జల్లులు) మాత్రమే కురిసే అవకాశం ఉంది.ఇది వర్షపాతాన్ని పెంచుతుంది. ఎల్–నినో భయం మధ్య కూడా తెలంగాణలో వ్యవసాయం చాలా వరకు పనిచేస్తోంది.

## జీవనాధారాన్ని కాల్చేసిన షార్ట్ సర్క్యూట్

- ఇస్త్రీ కార్మికుడి ఉపాధికి దెబ్బ



**ప్రజా వాయిస్ హనుమకొండ**/హసన్ పర్తి ఒక్క షార్ట్ సర్క్యూట్ ఓ కుటుంబ జీవనాధారాన్నే దెబ్బ తీసింది. గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారం కాకతీయ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇస్త్రీ డబ్బాలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.బాధితుడు శాగంటి సంపత్ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం రాత్రి వినియోగదారుల బట్టలకు ఇస్త్రీ చేసి వాటిని ఇస్త్రీ పెట్టెతో పాటు డబ్బాలో ఉంచి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున డబ్బాలో మంటలు కనిపించడంతో స్థానికులు వెంటనే కేయూ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.అయితే అప్పటికే ఇస్త్రీ డబ్బా పూర్తిగా కాలిపోగా, అందులో ఉన్న వినియోగదారుల విలువైన పట్టు చీరలు, ఇతర బట్టలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. రోజువారీ ఉపాధికి ఆధారమైన ఇస్త్రీ డబ్బా దగ్ధం కావడంతో కుటుంబ పోషణ ఎలా సాగించాలనే ఆందోళనలో ఉన్నానని బాధితుడు సంపత్ వాపోయాడు. ఈ ఘటనతో స్థానికులు కూడా విచారం వ్యక్తం చేశారు.



# గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే KR నాగరాజు

- విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్..

**ప్రజా వాయిస్ వరంగల్** (పర్వతగిరి):పర్వతగిరి మండలంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ,వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి తో కలిసి సందర్శించారు.విద్యార్థిలకు అందుతున్న భోజనం, వసతి, తాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్ల సౌకర్యాలను ఆయన పరిశీలించారు.హాస్టల్ లో హాజరు పటికను పరిశీలించి విధులకు రాని సిబ్బందిపై మండిపడ్డారు.విధులలో అలసత్వం నిర్వహిస్తున్న వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం,వసతి, భోజనం, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో అందుతున్న సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థుల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను తెలుసుకున్నారు.ఇటివల పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు దుప్పట్లు కావాలని ఎమ్మెల్యే నీ కోరడంతో నిన్న ఎమ్మెల్యే కలెక్టర్ తో కలిసి 150మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.విద్యార్థులకు ఆటలకు అవసరమైన సామాగ్రి కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి,జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్,స్థానిక సర్పంచ్ శంకర్,పర్వతగిరి గ్రామశాఖ అధ్యక్షులు కుసం రామచందర్,సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు,ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి,ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ వెంకన్న,మండల, గ్రామ,ముఖ్య నాయకులు,సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నా

# ఉప సర్పంచులకు వార్డు సభ్యులకు గౌరవ వేతనాలు ఇవ్వాలి

- జిల్లా కలెక్టరకు వినతి పత్రం అందించిన వనపర్తి జిల్లా ఉప సర్పంచుల ఫోరం

**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా** గ్రామాలలో స్వపరిపాలనను బలోపేతం చేయడంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందించడంలో మేము కీలకపాత్ర పోషిస్తున్నాము అని ఉప సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షులు బాల పిరు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మాకు ఉన్న అధికారాలు, గౌరవ వేతనాలు మరియు గుర్తింపు మా బాధ్యతలకు తగినట్లు లేవు అని అన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచులు వార్డు సభ్యులభాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి అలాగే వారి ఆత్మ గౌరవాన్ని కాపాడడానికి మా డిమాండ్లను నెరవేర్చలని ఆయన అన్నారు. 1.ఉపసర్పంచులకు గౌరవ వేతనం నెలకు 5000 రూపాయలు ఇవ్వాలని వార్డు సభ్యులకు నెలకు 3000 మంజూరు చెయ్యాలి 2. గ్రామాలలో జరిగే అన్ని ప్రభుత్వ అభివృద్ధి శిలా ఫలకాలపై సర్పంచులతోపాటు ఉప సర్పంచులు సంబంధిత వార్డు సభ్యుల పేర్లను తప్పనిసరిగా చేర్చాలి 3. గ్రామ పంచాయతీ లో అన్ని రకాల తీర్మానాలపై, నిధుల వ్యయంపై సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ కు కూడా ఉమ్మడిగా సంతకం చేసే అధికారాలు కల్పించాలి. 4. మండల స్థాయిలో జరిగే అన్ని సర్వసభ్య సమావేశాలకు ఎంపీడీవో కార్యాలయం సమావేశాలకు కూడా సర్పంచులను కూడా ఆహ్వానించాలి పై సమస్యలను అన్నింటినీ పరిశీలించి మాకు తగిన నయం చేయాలని ఉప సర్పంచుల ఫోరం డిమాండ్ చేస్తున్నట్లు ఉప సర్పంచ్ల సంఘంజిల్లా అధ్యక్షులు బాల పిరు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, రాములు యాదవ్, రవి, శ్రీనివాసులు, నరసింహ, మొగులాల్, ప్రేమ్ సాగర్, చిన్న రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ నిధుల్లేవు గానీ సమీక్షలా?

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై పాతూరి వెంకటస్వామి గౌడ్ తీవ్ర విమర్శలు**

**ప్రజా వాయిస్ అక్బర్ పేట** భూంపల్లినియోజకవర్గంలోని గ్రామాలకు అభివృద్ధి కోసం చిల్లి గవ్వ ఇవ్వడం లేదు గానీ, అభివృద్ధి సమీక్షా సమావేశాల పేరిట ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కొత్త డ్రామాలకు తెరలేపారని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.గతంలో మెదక్ ఎంపీగా పనిచేసినప్పుడైనా, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడైనా దుబ్బాక నియోజకవర్గానికి కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, నాయకులు గడ్డం వివేక్ వెంకటస్వామి నియోజకవర్గానికి వచ్చిన సమయంలో అభివృద్ధి నిధుల గురించి అడగని ఎమ్మెల్యే, కేవలం ప్రోటోకాల్ పేరుతో రగడ సృష్టించారని మండిపడ్డారు. మెదక్ ఎంపీగా దుబ్బాకకు తీసుకొచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.అభివృద్ధి పేరుతో రోజుకో కొత్త నాటకమాడుతున్నారని ఎద్దేవా చేస్తూ, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఇకనైనా ఈ డ్రామాలను బంద్ చేయాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లన్న గారి మధుసూదన్ రెడ్డి, ఎండి సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**ప్రజా వాయిస్/తాండూరు:** నియోజకవర్గంలో ప్రజలకు, రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి (బీఎంఆర్) ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లూజు విద్యుత్ వైర్లను వెంటనే సరిచేయాలని సూచించారు. రైతులకు నిర్ణీత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలని, నియోజకవర్గంలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యుత్ కనెక్షన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ సూర్య నాయక్, ఏడీ శంకర్ నాయక్, వివిధ మండలాల ఏఈలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# తూనికల మోసాలకు అడ్డేవరు..?




- నిద్రలో లీగల్ మెట్రాలజీ శాఖ
- రేషన్ నుంచి మాల్స్ వరకు తక్కువ తూకం దందా..!
- తనిఖీలు కరువు అక్రమాలకు బంగారు బాట
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మోసగాళ్లపై ఉక్కుపాదం మోపాలని ప్రజల డిమాండ్

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్:** రేషన్ దుకాణంలోనైనా, కిరాణా షాపులోనైనా, మటన్, చికెన్ దుకాణంలోనైనా సూపర్ మార్కెట్‌లోనైనా వినియోగదారుడికి అందుతున్న తూకంపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తూనికలు, కొలతల్లో అక్రమాలు పెరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వాటిని అరికట్టాల్సిన లీగల్ మెట్రాలజీ శాఖ మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితమైందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తనిఖీలు లేకపోవడంతో కొందరు వ్యాపారులు తక్కువ తూకం ఇచ్చి వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**తనిఖీలు లేకపోవడంతో.. మోసాలకు రెక్కలు**

చట్టం ప్రకారం ప్రతి తూనిక, కొలత పరికరాన్ని నిర్దిష్ట వ్యవధిలో ధ్రువీకరించి సీలు వేయాలి. వాటిని అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాలి. కానీ క్షేత్రస్థాయిలో అలాంటి తనిఖీలు కనిపించడం లేదని వినియోగదారుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధమైన తూనికలను ఉపయోగిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని చెబుతున్నారు.

**రేషన్ నుంచి మాల్స్ వరకు అదే కథ**

రేషన్ దుకాణాలు, కిరాణా షాపులు, కూరగాయల మార్కెట్లు, పండ్ల దుకాణాలు, మటన్,చికెన్ షాపులు, స్వీట్స్ షాపులు, సూపర్ మార్కెట్లు, భారీ షాపింగ్ మాల్స్ వరకు తక్కువ తూకం పేరుతో మోసాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. రోజూ లక్షలాది మంది వినియోగదారులు చిన్నచిన్న తేడాల పేరుతో భారీ నష్టాన్ని చవిచూస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**కార్యాలయాలకే పరిమితమైన అధికారులా..?**

ప్రజల హక్కులను కాపాడాల్సిన లీగల్ మెట్రాలజీ అధికారులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక డ్రైవ్‌లు లేకపోవడంతో అక్రమాలకు పాల్పడే వారికి భయం లేకుండా పోయిందని ప్రజలు అంటున్నారు. జిల్లాల్లో తనిఖీల సంఖ్య ఎంత? ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత మేర జరిమానాలు విధించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు.

**ప్రత్యేక డ్రైవ్ ఎప్పుడు..?**

రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టి రేషన్ దుకాణాల నుంచి మాల్స్ వరకు అన్ని వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్కువ తూకంతో వినియోగదారులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని భారీ జరిమానాలు విధించాలని కోరుతున్నారు. అదే సమయంలో వినియోగదారులు కూడా తాము కొనుగోలు చేసే వస్తువుల తూకాన్ని పరిశీలించి, అనుమానాలు ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.ఒక కిలో పేరుతో ఒక్కోసారి కొన్ని గ్రాములు తగ్గినా రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల వినియోగదారుల నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. తూనికల మోసాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, లీగల్ మెట్రాలజీ శాఖను క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రజాస్వామ్య పునరుద్ధరణకు వామపక్ష ఐక్యతే ప్రత్యామ్నాయం

- మిర్యాలగూడలో ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం
- బీజేపీ పాలనలో రాజ్యాంగ విలువలు ప్రమాదంలో పడ్డాయన్న అశోక్ ఓంకార్
- రైతులు, కార్మికులు, యువత సమస్యలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వమని విమర్శ
- కార్పొరేట్ అనుకూల విధానాలతో ప్రజలపై భారాలు పెరిగాయన్న ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం
- రెండ్రోజుల సమావేశాల్లో భవిష్యత్ పోరాటాలపై కార్యాచరణకు రూపకల్పన

**ప్రజా వాయిస్ – మిర్యాలగూడ:**దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పరిరక్షణ కోసం వామపక్ష, ప్రజాస్వామ్య, సామాజిక శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఎంసిపిఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని స్వాగత్ హోటల్‌లో మంగళవారం ప్రారంభమైన రెండ్రోజుల ఎంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గత పన్నెండున్నర సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువత ప్రయోజనాలను విస్మరించిందని ఆయన ఆరోపించారు. విద్య, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ సంపదను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మలుస్తూ ప్రజా సంక్షేమాన్ని బలహీనపరిచిందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు పెరగడం, రాజ్యాంగ సంస్థల స్వతంత్రత దెబ్బతినడం దేశంలో ఆందోళనకర పరిస్థితులకు దారితీసిందని విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ప్రజలపై ఉందని, రైతులు, కార్మికులు, యువత, విద్యార్థుల ఉద్యమాలకు ఎంసిపిఐ(యు) సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వామపక్ష శక్తుల ఐక్య పోరాటాలను మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు.ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ రెండ్రోజుల సమావేశాల్లో భవిష్యత్ కార్యాచరణ, ప్రజా పోరాటాలపై సమగ్ర చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు, నల్గొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోలిట్‌బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, మోర్తాల చందర్ రావు, రాష్ట్ర నాయకులు వస్కుల మట్టయ్య, కుంభం సుకన్య, వనం సుధాకర్, గోనె కుమార స్వామి, సంగతి సాంబయ్య, వరికుప్పల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ నాగ్‌పూర్ ప్రాంతీయ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు.అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలు, వాగులు, వంకలు, నదుల సమీపానికి వెళ్లొద్దని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడొద్దని పేర్కొన్నారు. భారీ వర్షాల వల్ల రహదారులపై నీరు నిలవడం, రవాణాకు అంతరాయం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, బలహీన నిర్మాణాలకు నష్టం జరిగే అవకాశం ఉన్నందున రైతులు పంటలు, వ్యవసాయ పరికరాల రక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.స్థానిక అధికార యంత్రాంగం, వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రజారక్షణలో అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.



# హెడ్ క్వార్టర్స్‌లో ఉండరు.. కానీ హెచ్.ఆర్.ఏ మాత్రం గుంజుతారు!

- పెద్దపల్లి జిల్లా పరిషత్ సీఈఓ కె.నరేందర్‌పై పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు
- నిబంధనలకు నీళ్ళు వదిలి 3 ఏళ్ళుగా మంచిర్యాల నుంచే రాకపోకలు
- సమగ్ర విచారణ జరిపి హెచ్.ఆర్.ఏ (హౌస్ రెంట్ అలవెన్సు) రికవరీ చేయాలి
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సముద్రాల రమేష్ డిమాండ్

**ప్రజా వాయిస్ మంథని** ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, హెడ్ క్వార్టర్స్‌లో నివాసం ఉండకుండా గత మూడేళ్లుగా నిబంధనలను ఉల్లంఘిస్తున్న పెద్దపల్లి జిల్లా ప్రజా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) కె. నరేందర్‌పై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సముద్రాల రమేష్ (మంథని) హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**నిబంధనల ఉల్లంఘన:**


ఫిర్యాదుదారుడు తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్ 45, 146, 22 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వంలోని ఏ కార్యాలయంలోనైనా, ఏ పదవిలో నియమితులైన ఉద్యోగి అయినా తప్పనిసరిగా తన ప్రధాన కార్యాలయం (హెడక్వార్టర్స్) పరిధిలోనే నివాసముంటూ విధులు నిర్వహించాలి. కాగా, జూన్/జూలై 2023లో బదిలీపై పెద్దపల్లి జడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన కె. నరేందర్, గత మూడేళ్ళుగా పెద్దపల్లి హెడ్ క్వార్టర్స్‌లో ఉండకుండా నిబంధనలకు విరుద్ధంగా మంచిర్యాల జిల్లాలోని తన స్వంత ఇంటి నుంచే ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు.

**జీవో ఎంఎస్ నెం. 20 కి తూట్లు:**

ప్రభుత్వం విడుదల చేసిన G.O.Ms.No. 20 (తేదీ: 08-02-2001) ఉత్తర్వులను జడ్పీ సీఈఓ పూర్తిగా ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెడ్ క్వార్టర్స్‌లో నివాసం ఉండకుండా, ప్రభుత్వం నుంచి పొందుతున్న హెచ్.ఆర్.ఏ – (హౌస్ రెంట్ అలవెన్సు) ను చట్టవిరుద్ధంగా లబ్ధి పొందడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రికవరీ చేసి చర్యలు తీసుకోవాలి:**

సదరు అధికారి తీరుపై సమగ్ర విచారణ జరిపి, గత మూడేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా పొందిన హెచ్.ఆర్.ఏ మొత్తాన్ని తక్షణమే రికవరీ చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఆయనపై తగిన క్రమశిక్షణా చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇప్పటికే తేది 13-07-2026న పెద్దపల్లి కలెక్టర్‌కు, తేది 17-07-2026న హైదరాబాద్ పంచాయతీరాజ్ & రూరల్ ఎంప్లాయ్‌మెంట్ కమిషనర్‌కు కూడా వినతిపత్రాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు.





## కాగజ్‌నగర్‌లో భూగర్భ జలమట్టం పెంపుపై కలెక్టర్ సమీక్ష

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ కొమరం భీం** ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్‌నగర్ మండలం వంజరి రైతు వేదికలో జిల్లా కలెక్టర్ కె.హరిత మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి సెర్ప్ ఏపీఎంలు, సీసీలు, వీఓలతో ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఎల్ నినో ప్రభావం వల్ల లోటు వర్షపాతం నెలకొందని, భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సామాజిక ఇంకుడు గుంతలు, ఫారం పాండ్లు, నీటి కుంటలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణం చేపట్టాలని సూచించారు. జలసిరి పథకం కింద వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా భూగర్భ జలమట్టం పెంపునకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఇందులో భాగస్వాములను చేయాలని తెలిపారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు 125 పని దినాలు కల్పించాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆగస్టు 15లోగా రెండు జతల యూనిఫామ్‌లు అందించేలా కార్యాచరణ రూపొందించాలని, కుట్టు మిషన్ల సంఖ్య పెంచి యుద్ధప్రాతిపదికన కుట్టించాలని సూచించారు. ప్రతి వీఓ కింద 15 స్వయం సహాయక సంఘాలు ఉండేలా చూడాలని, నమోదు కాని వారిని కొత్త సంఘాల్లో చేర్పించాలని తెలిపారు. అంతకుముందు రైతు వేదిక ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

# పార్కులు, గ్రాండ్ ఎంట్రెన్స్‌లు నగర ప్రతిష్ఠను ప్రతిబింబించాలి



- కమిషనర్ టి. వెంకన్న

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** పార్కులు, గ్రాండ్ ఎంట్రెన్స్‌లు నగర ప్రతిష్ఠను ప్రతిబింబించాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అన్నారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో నగరంలోని హార్టికల్చర్ విభాగం పరిధిలోని పార్కులు, సెంట్రల్ మీడియన్లు, నర్సరీలు, గ్రాండ్ ఎంట్రెన్స్‌ల వద్ద చేపడుతున్న సుందరీకరణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.మొదట పబ్లిక్ గార్డెన్స్‌ను సందర్శించిన కమిషనర్ అక్కడ మొక్కల నిర్వహణ తీరును పరిశీలించారు. పార్కులో కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ, నడక మార్గాల వెంట ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పార్కులను సందర్శించే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచిస్తూ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.అనంతరం ఎల్లాపూర్‌లో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవం సందర్భంగా పంపిణీ చేసేందుకు పెంచుతున్న మొక్కల వివరాలను హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి వద్ద తెలుసుకున్నారు. నర్సరీలో అన్ని రకాల మొక్కలను ఆరోగ్యవంతంగా పెంచి, వనమహోత్సవ కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.తదుపరి ఎల్లాపూర్ కరీంనగర్ గ్రాండ్ ఎంట్రెన్స్ వద్ద చేపడుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. ప్రవేశ ద్వారం నగరానికి ప్రతీకగా నిలిచేలా, ఆకర్షణీయమైన అలంకార మొక్కలు, పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించేలా హరిత వాతావరణాన్ని మరింత అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.హసన్‌పర్తి అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం వద్ద కొత్తగా అభివృద్ధి చేసిన గ్రీనరీ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ అక్కడ మొక్కలు నాటారు. అనంతరం ఆరేపల్లి వద్ద ములుగు గ్రాండ్ ఎంట్రెన్స్‌ను సందర్శించి సుందరికారణ పనులను పరిశీలించారు. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించడం, మొక్కలకు అవసరమైన కత్తిరింపులు చేపట్టడం, పచ్చదనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం ద్వారా నగర సౌందర్యాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.నగరంలోని అన్ని పార్కులు, సెంట్రల్ మీడియన్లు, నర్సరీలు, గ్రాండ్ ఎంట్రెన్స్‌ల నిర్వహణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, హరితీకరణ పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలలో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఏఈ వరుణ్, హార్టికల్చర్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సిర్పూర్ పేపర్ మిల్లు వద్ద 70వ రోజుకు చేరిన కార్మికుల రిలే నిరాహార దీక్షలు

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర మండలం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్పీఎం గేటు వద్ద కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 70వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు దీనిపై పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.సిర్పూర్ పేపర్ మిల్లు ఎంప్లాయిస్ ప్రొడక్షన్ యూనియన్ (రిజిస్ట్రేషన్ నెంబర్ ఈ–2381) కార్యనిర్వాహక అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోలెం వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం..తెలంగాణలోని ఇతర కంపెనీల్లో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరుగుతున్నా, ఆర్టీసీలో సైతం ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నా, సిర్పూర్ నియోజకవర్గంలోని ఏకైక సిర్పూర్ పేపర్ మిల్లులో మాత్రం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. యజమాన్యం ఎన్నికల అంశంపై కోర్టుకు వెళ్లడం, కార్మిక శాఖ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తేదీ ప్రకటించే వరకు 700 రోజులైనా పోరాటం ఆపబోమని, యజమాన్యం బెదిరింపులకు జంకబోమని ప్రభుత్వాన్ని, యజమాన్యాన్ని హెచ్చరించారు.70వ రోజు దీక్షలో అల్లం శ్రీనివాస్, గడమల్ల మహేష్ కూర్చున్నారు. దీక్షకు సంఘీభావం తెలిపిన వారిలో జేఏసీ అధ్యక్షులు ఏకే సింగ్, బీజేపీ సీనియర్ నాయకులు ఠాకూర్ విజయ్ సింగ్, యూనియన్ ఉపాధ్యక్షులు (రిజిస్ట్రేషన్ నెంబర్ ఈ–2735) చెట్లవేన రాజేష్ యాదవ్, చిట్యాల తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు తన్నీరు పోచం, బీజేపీ నాయకులు పిరిసింగుల తిరుపతి తదితరులు ఉన్నారు.

## ఆసిఫాబాద్‌లో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

- గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కోసం ఐదు రోజుల విషయాల వారీ శిక్షణ కార్యక్రమం మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)లో ప్రారంభమైంది. దీన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ ప్రారంభించారు.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జాదవ్ అంబాజీ తెలిపారు. ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకుని విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు.మొదటి విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, బయోసైన్స్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు శిక్షణ అందించనున్నారు. విద్యార్థి కేంద్రిత బోధన, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అభ్యాస ఫలితాల సాధన, నూతన బోధనా విధానాలు, తరగతి గది నిర్వహణ అంశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు జాదవ్ అంబాజీ సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, పీఎంఆర్సీ ఏసీఏంఓ పూర్కా ఉద్ధవ్, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, ప్రధానోపాధ్యాయులు, శిక్షణ సమన్వయకర్తలు, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేసి

- రహదారి మౌలిక వసతుల బలోపేతానికి కేంద్ర సహకారం కోరిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని కరుణాపురం నుండి పెద్ద పెండ్యాల, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, ధర్మసాగర్ మండల హెడ్‌క్వార్టర్, దేవునూర్, సోమ దేవరపల్లి, దామెర, ఎల్కతుర్తి మండల హెడ్‌క్వార్టర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఈ రోడ్డు హైదరాబాద్ నుండి కరీంనగర్, సిద్ధి పేటకు వెళ్లే వాహనాలు వరంగల్ వెళ్లే అవసరం లేకుండా 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు నిత్యం వినియోగిస్తున్నారని వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.అలాగే యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–163) నాలుగు లైన్ల విస్తరణ సమయంలో పలు గ్రామాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్ల మధ్య మిగిలిపోయిన లింకులను పూర్తి చేయాలని కోరారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు ఉన్నప్పటికీ వాటి మధ్య అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని వివరించారు. అవసరమైన భూమి ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో మిగిలిన లింకుల నిర్మాణానికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కేంద్ర రోడ్డు మరియు మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) 2025–26 కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని కోరారు. నర్సంపేట–నందిగామ రహదారి విస్తరణ, భట్టుపల్లి–హంటర్ రోడ్ మార్గ అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలైతే గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

## ఒక్క అండర్ పాస్ కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి** ఎల్కతుర్తి మండలం శాంతినగర్ గ్రామంలోకి ప్రవేశించేందుకు నూతనంగా నిర్మిస్తున్న ఎన్ హెచ్ 563 జాతీయ రహదారి వల్ల శాంతినగర్ గ్రామానికి వెళ్లాలంటే విద్యార్థులకు ,రైతులకు ,ప్రజలకు సరైన అండర్ పాస్ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారి రాకపోకలతో పాటు విద్యార్థులు రైతులు వాహనాదారులు దీని ద్వారా అదనపు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. శాంతినగర్ లో ప్రైవేట్ పాఠశాల విద్యుత్ సబ్స్టేషన్ రైస్ మిల్ విస్తారమైన వ్యవసాయ భూములు ఉండడంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది గ్రామస్తులు తమ వ్యవసాయ భూములకు వెళ్లాలంటే చిన్న పాపయ్యపల్లి అండర్ బ్రిడ్జి వరకు వెళ్లి తిరిగి శాంతినగర్ చేరుకోవాల్సి వస్తోంది. అలాగే హుజురాబాద్ కు వెళ్లాలంటే కోతుల నడుమ అండర్ పాస్ నుండి యూటర్న్ తీసుకొని తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో సమయం ఇంధనం ప్రయాణ భారం అనవసరంగా పెరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ గ్రామ సూచిక బోర్డు బస్ స్టాప్ నిర్మాణం చేపట్టకపోవడం కూడా స్థానికులను నిరాశకు గురిచేస్తుంది. గ్రామస్తులు ప్రధానంగా శాంతినగర్ ప్రైవేట్ పాఠశాలకు యూటర్న్ రోడ్డు నిర్మించడంతోపాటు సురక్షితమై యూటర్న్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని జాతీయ రహదారుల అధికారులను కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ కు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడంతో పాటు జాతీయ రహదారుల అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో గ్రామస్తుల్లో అసంతృప్తి నెలకొంది. దీంతో మంగళవారం గ్రామస్తులు పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎల్కతుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు. శాంతినగర్ ప్రజలు కోరుతున్న కనీస రవాణా సౌకర్యాలను అధికారులు తక్షణమే కల్పించి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా శాశ్వత పరిష్కారం చెప్పాలని కోరారు. వెంటనే డైవర్షన్ గా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాసాని వేలంగి మేరీ రాయపు రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, సందీప్ రెడ్డి, పెద్దారెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఇన్నారెడ్డి, పెంటారెడ్డి, స్వప్న, సింగిరెడ్డి, జ్యోతి, సెంట్ ఆన్స్ స్కూలు యజమాన్యం వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎంఎస్ఎఫ్ కమిటీల నిర్మాణానికి శ్రీకారం

- విద్యార్థి సమస్యల పరిష్కారామే లక్ష్యంగా
- సెప్టెంబర్ 8న 'చలో హైదరాబాద్' కు సిద్ధం కావాలి.
- వికారాబాద్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ.

ప్రజా వాయిస్/తాండూరు: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంఎస్ఎఫ్‌ను గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఎంఎస్ఎఫ్ వికారాబాద్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం తాండూరు పట్టణంలో నిర్వహించిన ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో నూతన ఎంఎస్ఎఫ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థి సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలను డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోఎంఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లోన్ పేరుతో మహిళకు సైబర్ వేధింపులు

- ఫోటో మార్ఫింగ్ తో రూ.6.70 లక్షల మోసం
- లోన్ ఇప్పిస్తామని నమ్మించి వ్యక్తిగత వివరాల సేకరణ
- పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ
- రూ.3.20 లక్షలు హోల్డ్ చేసిన పోలీసులు
- ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన వైనం




**ప్రజా వాయిస్ బూర్గుంపాడు** బూర్గంపాడు మండల కేంద్రంలోని గౌతాపురం కాలనీలో లోన్ ఇప్పిస్తామని నమ్మించి ఓ మహిళను సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రుణం మంజూరు చేస్తామని నమ్మించిన నిందితులు బాధితురాలి నుంచి ఆధార్ కార్డు, పాన్ కార్డు, మొబైల్ నంబర్‌తో పాటు ఇతర వ్యక్తిగత వివరాలను సేకరించారు. అనంతరం వాటిని దుర్వినియోగం చేస్తూ ఆమె ఫోటోను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా రూపొందించిన చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపించారు.ఆ మార్ఫింగ్ ఫోటోలను సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ చేస్తామని, కుటుంబ సభ్యులు, బంధువులకు పంపిస్తామని బెదిరిస్తూ, భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితురాలు పరువు పోతుందనే ఆందోళనతో నిందితులు చెప్పిన విధంగా విడతల వారీగా పలుమార్లు నగదు బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం రూ.6 లక్షల 70 వేల వరకు కేటుగాళ్ల ఖాతాలకు చేరినట్లు సమాచారం.కొంతకాలం తర్వాత తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన బాధితురాలు బూర్గంపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సైబర్ క్రైమ్ విభాగం అధికారులతో సమన్వయం చేసి బ్యాంకు లావాదేవీలను పరిశీలించారు. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటికే నిందితుల ఖాతాల్లోకి వెళ్లిన నగదులో రూ.3 లక్షల 20 వేల మొత్తాన్ని హోల్డ్ చేయించడంలో విజయవంతమయ్యారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బూర్గంపాడు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. డబ్బు బదిలీ అయిన బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు, ఐపీ అడ్రస్‌లు, డిజిటల్ లావాదేవీల వివరాలను సేకరిస్తూ నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేసి పూర్తి వివరాలను వెల్లడిస్తామని బూర్గుంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపారు.

### ప్రజలకు పోలీసుల హెచ్చరిక...

లోన్‌లు ఇప్పిస్తామని చెప్పే అపరిచిత వ్యక్తులు, ఆన్‌లైన్ సంస్థలను నమ్మి ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు వివరాలు, ఓటీపీలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వవద్దని పోలీసులు సూచించారు. ఫోటో మార్ఫింగ్, సోషల్ మీడియా బెదిరింపులు, డిజిటల్ అరెస్ట్, లోన్ మోసాలు వంటి సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ అధికారులను సంప్రదించాలని, వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్సై మెడ ప్రసాద్ తెలిపారు.



# చౌడారంలో పచ్చదనం పరిమళం

- వనమహోత్సవంలో గ్రామస్తులకు సీఐ పిలుపు

**ప్రజా వాయిస్ చిన్నకోడూరు** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని చౌడారం గ్రామంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, ఘనంగా జరిగింది. భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే దృఢ సంకల్పంతో గ్రామ పరిసరాల్లో సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు కలిసి ఒకే రోజు 120 మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్నకోడూరు సీఐ సిహెచ్. విద్యాసాగర్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని కాపాడి పెద్ద వృక్షాలుగా మార్చడం అంతకంటే ముఖ్యమని స్పష్టం చేశారు. కేవలం మొక్క నాటడంతో బాధ్యత తీరిపోదని, ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క సంరక్షణ బాధ్యతను తమ సొంత ఇంటి పనిలా స్వీకరించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. పచ్చని చెట్లతోనే ఆరోగ్యకరమైన, సుఖమయమైన సమాజం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ వనమహోత్సవంలో చిన్నకోడూరు ఎస్ఐ బి. చంద్రమోహన్, పోలీస్ సిబ్బందితో పాటు గ్రామానికి చెందిన యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా మొక్కలు నాటుతూ కార్యక్రమాన్ని విశేషంగా విజయవంతం చేశారు.

# వర్ధన్నపేటలో కీచక టీచర్

- 4 సం, చిన్నారిపై అత్యాచార యత్నం
- బండౌతాపురం గ్రామంలో ఘటన
- ప్రధానోపాధ్యాయుడి గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండకు తరలించిన పోలీసులు

**ప్రజా వాయిస్ వరంగల్** (వర్ధన్నపేట): మండలంలోని బండౌతపురం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండౌతపురం గ్రామంలో తన ఇంటి ముందు ఆడుకుంటూ భాస్కర్ ఇంటి వెనకాల వెళ్లిన 4 ఏళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశ చూపెట్టి, అదే గ్రామానికి చెందిన భాస్కర్ ..అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు..చిన్నారి ప్రైవేట్ భాగాలను తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు.పాప కోసం వెతుకుంటూ వెళ్లిన తల్లికి ఈ దారుణం కనిపించింది. వెంటనే చిన్నారిని జరిగిన సంఘటన గురించి తల్లికి వివరించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం దర్యాప్తులో నేర నిర్ధారణ కావడంతో నిందితుడిని రిమాండ్ కు పంపించినట్లుగా పోలీసులు తెలిపారు.భాస్కర్ ప్రస్తుతం జాఫర్గడ్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు..



# జూనియర్ కళాశాలకు ప్రహరీ, రోడ్డు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ వినతి

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించి, బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హరికకు వినతి పత్రం అందజేశారు. కళాశాల స్థలం ఆక్రమణలకు గురవుతోందని, మిగిలిన భూమిని పరిరక్షించేందుకు వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు.కళాశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రాథమిక వసతులు కల్పించాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్నాథ్ పూర్ లో వడ్డెర సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి** ఎల్కతుర్తి మండలం జగన్నాథ్ పూర్ గ్రామంలో వడ్డెర సంఘం గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపు సుధాకర్ హుస్నాబాద్ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు బొంత రమేష్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు గొల్లెన ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి పట్టణ అధ్యక్షుడు ఓర్సు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి అల్లెపు ప్రశాంత్, కోశాధికారి అల్లెపు రాజు హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. గోపాల్పూర్ గ్రామ అధ్యక్షుడు సూర మొగిలి ఉపాధ్యక్షుడు గండికోట జంపయ్య, ప్రధాన కార్యదర్శి ఓర్సు కొమురయ్య, సహాయ కార్యదర్శి గండికోట రాము, పాల్గొని కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జగన్నాథ్ పూర్ గ్రామ వడ్డెర సంఘం నూతన కమిటీలో మహిళ అధ్యక్షురాలిగా శివరాత్రి ఈశ్వరమ్మ, అధ్యక్షులుగా శివరాత్రి మల్లయ్య, గౌరవ అధ్యక్షులుగా బొంత అనిల్, ఉపాధ్యక్షులుగా బొంత సరి, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి మొగిలి, కార్యదర్శిగా బొంత సాంబరాజు, కోశాధికారిగా శివరాత్రి చిరంజీవి, ప్రచార కార్యదర్శిగా కస్తూరి కుమార్ లు ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో జగన్నాథ్ పూర్ గ్రామంలోని వడ్డెర సంఘం మరింత బలోపేతమై గ్రామ అభివృద్ధి వడ్డెర సమాజ సంక్షేమానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**ప్రజా వాయిస్ /రాయపర్తి**,వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో గాదరి పూలమ్మ ఇల్లు ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో ఓ కుటుంబం నివాసముంటున్న ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అగ్నికి ఆహుతై బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైంది.ఈ విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం మానవతా దృక్పథంతో వారికి 10,000 రూపాయలు 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందించి, ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.గ్రామస్థులు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి చేసిన సహాయాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు మండల పార్టీ నాయకులు లేతాకుల రంగారెడ్డి కర్ర రవీందర్ రెడ్డి అయితే రామచందర్ దేశ బోయిన ఉపేందర్ చందు రామ్ సంకినేని ఎల్ల స్వామి మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య గిరిక సురేష్ ఎండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు శాపంగా సోషల్ మీడియా!

- నకిలీ ఖాతాలు సృష్టించి బ్లాక్ మెయిల్ లకు తెగబడుతున్న ముఠాలు
- మహిళల,యువతుల బలహీనతే నేరగాళ్లకు ఆయుధం మారుతున్న వైనం
- పోలీసులకు పిర్యాదు చేయలేక.. ఇంట్లో చెప్పుకోలేక
- సోషల్ మీడియా వలలో చిక్కుకొని సర్వనాశనమైన జీవితాలెన్నో !
- అప్రమత్తత అవసరం లేదంటే కుటుంబాలు చిన్నా బిన్నం




**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి వేదికలపై అసభ్య కామెంట్లు, ఫేక్ అకౌంట్లు సృష్టించడం మరియు వ్యక్తిగత ఫోటోలను దుర్వినియోగం చేయడం వంటి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు.కేవలం యువతులనే కాదు వివాహిత మహిళలను సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తూ బ్లాక్ మెయిల్ కు పాల్పడుతూ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. అయితే ఇలాంటి కేసులు వికారాబాద్ లో అనేకం కాగా ఎవరో ఒకరిద్దరు మహిళలు మాత్రమే ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా,బయటికి రాని వారి సంఖ్య వందల్లోనే ఉంటుందని సమాచారం.

### బ్లాక్ మెయిల్ ఎలా చేస్తున్నారు?

సోషల్ మీడియాలో స్త్రీల పేరు మీదనే నకిలీ ఖాతాలు తెరుస్తారు,ఆ తర్వాత సోషల్ మీడియాలో ఎక్కువ సమయం కేటాయించే యువతులకు,మహిళలకు మెసేజ్ లు పంపడం మొదలు పెడతారు. ఉదాహరణకు: మీరు పెట్టే పోస్టులు బాగుంటాయని,నేను మీ ఫాలోవర్ ను అని,మీలాంటి గొప్పవారితో కలవాలని ఆశగా ఉందని..ఇలాంటి సందేశాలు పంపి ఆకట్టుకొని రిప్లై కోసం ఎదురు చేస్తారు.పొరపాటున రిప్లై ఇవ్వగానే వెంటనే నకిలీ ఖాతా పేరును పురుషుడి ఖాతాగా పేరు మార్చి చాటింగ్ జరిపిన స్క్రీన్ షాట్ లను మీ కుటుంబ సభ్యులకు పంపుతానని బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెడతారు.దీంతో ఎందరో మహిళలు,యువతులు వారు చెప్పిందల్లా చేయడం మొదలు పెడతారు.చివరికి బ్లాక్ మెయిలర్ పెట్టే టార్చర్ కు వారిని ఫిజికల్ గా కూడా లొంగిపోతారు. అంతటితో ఆగకుండా నగలు,డబ్బు కూడా డిమాండ్ చేసి మహిళల జీవితాలను సర్వ నాశనం చేసే ముఠాలు ప్రస్తుత సమాజంలో అనేకం.

### తస్మాత్ జాగ్రత్త

సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తుల పట్ల యువతులు,మహిళలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.ఒకవేళ ఎవరైనా బ్లాక్ మెయిల్ కు పాల్పడినట్లైతే కుటుంబ సభ్యుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేయాలి.అలా కాకుండా మానసిక క్షోభకు గురై బ్లాక్ మెయిల్ ముఠా చేతిలో పడి మీ ఒక్కరి జీవితమే కాకుండా కుటుంబాలు సర్వనాశనం అవుతున్నాయి,కావున తస్మాత్ జాగ్రత్త.

# హామీలకే పరిమితమైన సీసీ రోడ్లు

- ఖానాపూర్ లో ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం!
- 8 నెలలుగా పెండింగ్ లోనే సీసీ రోడ్ల పనులు
- వర్షాలతో బురదమయంగా మారిన అంతర్గత దారులు
- నరకం చూస్తున్న గ్రామస్థులు
- వెంటనే పనులు ప్రారంభించకపోతే ఆందోళన తప్పదని ప్రజాస్వామ్య హెచ్చరిక



**ప్రజా వాయిస్ మంథని** పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతోంది. గ్రామంలో రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన డాంబర్ రోడ్డు నిర్మాణం పూర్తయి ప్రజలకు ఊరటనిచ్చినప్పటికీ, దానికి అనుబంధంగా చేపట్టాల్సిన సీసీ రోడ్ల పనులు మాత్రం ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. డాంబర్ రోడ్డు పనులు పూర్తయిన వెంటనే గ్రామంలోని సీసీ రోడ్ల పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని అధికారులు, కాంట్రాక్టర్లు ఊరించినప్పటికీ.. 8 నెలలు గడుస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామంలోని అంతర్గత రహదారులు పూర్తిగా బురదమయంగా మారాయి. దీంతో దారి పొడవునా నడవలేక స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, విద్యార్థులు, అత్యవసర వైద్య సేవలకై వెళ్లే బాధితులు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

"రేపు.. మాపు" అంటూ కాలయాపన:సీసీ రోడ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై గ్రామానికి చెందిన స్థానికులు సంబంధిత సూపర్వైజర్‌ను పలుమార్లు నిలదీసినా.. "నాలుగు రోజులు, ఐదు రోజుల్లో చేస్తాం" అంటూ కాలయాపన సమాధానాలు చెబుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్, పీఆర్‌డి అధికారుల బృందం తక్షణమే స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఖానాపూర్ గ్రామంలో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామ ప్రజలు స్పష్టం చేశారు.



# అండర్ పాస్ బ్రిడ్జిలతో అవస్థలు పడుతున్న జహీరాబాద్ ప్రజలు

- కుంటలను తలపిస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు..
- అవస్థలు పడుతున్న వాహనదారులు ప్రజలు
- సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికుల వినతి

**ప్రజా వాయిస్ జహీరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ము న్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ నుండి వెళ్ళే రైల్వే అండర్ బ్రిడ్జ్, మరియు భవాని మందిర్ రోడ్డు వెనకాల నుండి వెళ్ళే మార్గంలో గల బస్తీలకు వెళ్ళే మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి చిన్నపాటి వర్షానికి నిండు కుంటను తల పిస్తోంది. ప్రధాన ఈ రహదారిలో ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించకపోవడం తో నిలిచిన భారీ వర్షపు నీరుతో దారి గుండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై నుండి ఆయా వీధిల కాలనీకి వెళ్ళే విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. మోకాలు లోతు గుంతలు ఈ రహదారిపై పడటంతో ఎటు నుండి ప్రయాణం చేయాలో అర్థం కావటం లేదని కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కొన్ని రోజుల క్రితం ఈ దారి గుండా బైక్ పై ప్రయాణిస్తూ యువకులు, వృద్ధులు కిందపడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై గతంలో సదరు రైల్వే అధికారులకు, మున్సిపల్ అధికారులకు సమస్యను పరిష్కరించాలని విన్నవించుకున్నా లాభం లేకుండా పోయిందని కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికీ అయినా సంబందిత శాఖ అధికారులు స్పందించి వెంటనే నిలిచి ఉన్న నీటిని తొలగించి కాలువను తక్షణమే నిర్మించాలని కోరుతున్నారు. తద్వారా ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు మున్సిపల్ శాఖకు, అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ కు అధికార పార్టీ నేతలకు మరియు ప్రతిపక్ష కౌన్సిలర్లకు ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు విద్యపైనే

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- ఎంపీడీవో దామోదర్



**(ప్రజా వాయిస్) చేగుంట :** (చిన్న శంకరం పేట్ )చిన్న శంకరంపేట మండలం లోని ఎస్సీ హాస్టల్లో సందర్శించిన ఎంపీడీవో, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో దామోదర్ సూచించారు మంగళవారం చిన్న శంకరంపేట ఎస్టి హాస్టలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా నిత్యవసర వస్తువులను రికార్డులను మూత్రశాలలను పరిశీలించారు, అనంతరం ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్ వెంకటస్వామికి సూచించారు విద్యార్థులకు నాణ్యమైన నిత్యవసర వస్తువులను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు హాస్టల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వార్డెన్ అడిగి తెలుసుకొని సమస్య లేదని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు,



# విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- డీఈవో రాజు

**ప్రజా వాయిస్, పాపన్నపేట...** ప్రభుత్వ బడ్జెట్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాజు పేర్కొన్నారు. మంగళవారం కేజీబీవీ, పాపన్నపేట ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్ఎం మహేశ్వర్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# నో రిజిస్ట్రేషన్.. సారు కునుకులో ఉన్నాడు

- సారు కు మించి.. అధికారులు సైతం
- గట్టిగా అడిగితే పత్రాలు సరిలేవు అంటూ సమాధానాలు
- రిజిస్రేష్ ఆఫీసులో అధికారుల తీరుపై మండిపడుతున్న బాధితులు



**ప్రజా వాయిస్ వరంగల్ (వర్ధన్నపేట):** నిత్యం రిజిస్ట్రేషన్లతో బిజీగా ఉండే వర్ధన్నపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం లో అధికారులు లంచాలకు పాల్పడుతున్నట్లుగా గత కొద్ది రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న పట్టించుకునే నాధుడులేక అటు అక్కడకు వచ్చిన బాధితులు తీవ్ర ఇబ్బందులకుంగురవుతున్నారు.ఐతే ఇదిలా ఉండగా అక్కడకు నూతనంగా పెళ్లి చేసుకున్న వధూవరులు మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసమో లేక పోతే రైతులు భూమి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన బాధితులకు సారు గాఢ నిద్రలో ఉండటమే కాకుండా సారే కదా మాకేంటి మేమేం మాత్రం తగ్గేదే లే అన్నట్టుగా ఎక్కడి వారు అక్కడ నిద్రలోకి జారుకుంటూ వచ్చిన బాధితులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు..అదేంటని ఎవరైనా నిరక్షరాస్యులు ప్రశ్నిస్తే ఎవరికి చెపుతావో చెప్పుకో అంటూ.. లేదంటే పత్రాలు సరిగా లేవు అంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.. పక్కనే ఉన్న అటెండర్ సైతం అక్కడకు వచ్చిన వారిపై అధికారికి మించి వాగ్వాదాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు..ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న అవకతవలపై అధికారుల తీరుపై కలెక్టర్ స్పందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..